పల్లెలు అధ్వానం

- కంపు కొడుతున్న కాలనీలు
- పేరుకుపోయిన డ్రెయినేజీలు
- అంతటా ప్రత్యేకాధికారులే..
- పాలకులు లేక ప్రజలకు తిప్పలు



ఇది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని డ్రెయినేజీ. ఇక్కడ చెత్తను సరిగ్గా తొలగించకపోవడంతో మోరీ నుంచి దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రత్యేకాధికారులు గ్రామాల్లోకి రాకపోవడంతో డ్రెయినేజీలు పేరుకుపోయి కాలనీలు కంపుకొడుతున్నాయి.



ఈ చిత్రం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని డ్రెయినేజీ. ఇక్కడ నిత్యం మురికినీరు నిలిచి ఉంటుండడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. కాలనీవాసులు అనేకసార్లు డ్రెయినేజీని శుభ్రం చేయాలని కోరినా సిబ్బంది పట్టించుకోవడం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని స్థానికులు వాపోతున్నారు.



ఇది వేములవాడరూరల్ మండలం నాగాయపల్లి గ్రామం. ఈ ఊరిలో డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోయి మురుగునీరు ముందుకు కదలడం లేదు. ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతో పల్లెలు కంపు కొడుతున్నాయి.

ఎల్లారెడ్డిపేట/వేములవాడరూరల్: జిల్లాలో పాలక వర్గాలు లేక పల్లెల్లో పారిశుధ్య పనులు సాగడం లేదు. ఫలితంగా కాలనీలు కంపుకొడుతున్నాయి. గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేక ఏడాది గడుస్తుండగా, మున్సిపాలిటీల పదవీకాలం ఇటీవల ముగిసింది. అటు పల్లెలకు.. ఇటు మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. దీంతో తమ సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. గ్రామాల్లో డ్రెయినేజీల్లో పూడిక తీయక దోమలు పెరిగి రోగాలు విజృంభిస్తున్నాయి. మున్సిపాలిటీల్లోని కాలనీల్లో చెత్త పేరుకుపోయి పరిసరాలు కంపుకొడుతున్నాయి. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 135 మంది ప్రత్యేకాధికారులు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 255 గ్రామపంచాయతీలకు గాను 134 మందిని, రెండు మున్సిపాలిటీలకు ఒకరిని ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీకాలం ముగిసిపోవడంతో ఎంపీపీల స్థానంలో మరో 12 మంది ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. గ్రామాల్లో గత ఫిబ్రవరి 2తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనతో గ్రామాలు అధ్వానంగా మారగా, ఏడాదిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రజలకు శాపంగా మారింది. ప్రత్యేకాధికారులు కనీసం అందుబాటులో ఉండడం లేదని, వారు ఎప్పుడు వచ్చి వెళ్లారో తెలియని పరిస్థితులున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంజూరుకాని బిల్లులు

తాజామాజీ సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక ఆందోళన బాట పడుతుంటే.. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు చేయిస్తునన పనులకు సైతం నిధులు లేమి ఉందని సమాచారం. గ్రామ కార్యదర్శులు పండుగలకు, ఇతర సమావేశాల సందర్భంగా గ్రామాల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయించడం, వీధిలైట్లు మార్చడం, ఇతర సౌకర్యాల కల్పనకు సొంతంగా ఖర్చు పెడుతున్నారని సమాచారం. చిన్న గ్రామపంచాయతీల్లో ప్రతీనెల ఆదాయం లేక ట్రాక్టర్ కిస్తీలు, విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలు కూడా చెల్లించేందుకు డబ్బులు లేనట్లు తెలిసింది. కొందరు కార్యదర్శులు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో ఉన్నతాధికారులు మెమోలు జారీ చేసినట్లు సమాచారం. చాలా గ్రామాల్లో ఇంటి పన్ను, నల్లా బిల్లులు వసూలు చేసి ట్రాక్టర్ కిస్తీలు, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. పంచాయతీల్లో నిధులు లేకనే ఈ పరిస్థితి ఉన్నట్లు పలువురు పంచాయతీ కార్యదర్శులు వాపోయారు.



రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

అధికారులు వత్తలేరు



ఏమైన సమస్య ఉంటే సర్పంచులకు చెప్పుకునేటోళ్లం. ఇప్పుడు వాళ్ల పదవి అయిపోయిందని తెలిసింది. అధికారులు ఎవరు వత్తున్నారో తెలుత్తలేదు. కనీసం వార్డుసభ్యులు కూడా లేకపోవడంతో ఎవరికీ సమస్యలు చెప్పుకోవాల్నో తెలుత్తలేదు. మురికి కాల్వలు తీస్తలేరు. వీధిలైట్లు వస్తలేవు.

– ఎరుపుల లక్ష్మి, ఎల్లారెడ్డిపేట

ప్రత్యేకాధికారులు పరిశీలిస్తారు



గ్రామాల్లోని సమస్యలను ప్రజలు ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకురావాలి. అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు పరిశీలించాలి. డ్రెయినేజీలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. వీధిలైట్లను సరిచేయాలి. స్వచ్ఛతాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– శేషాద్రి, ఇన్‌చార్జి డీపీవో

క్లుప్తంగా

కృష్ణారెడ్డికి మద్దతుగా ప్రచారం



ముస్తాబాద్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డిని గెలిపించాలని తెలంగాణ యువశక్తి నాయకులు కోరారు. ముస్తాబాద్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో కృష్ణారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. జగదీశ్, విఠోబా తదితరులున్నారు.

'అంజిరెడ్డిని గెలిపించండి'



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్: భారతీయ జనతా పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని, ఉపాధ్యాయ అభ్యర్థి మల్క కొమురయ్యలను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు గంభీరావుపేటలో ఆదివారం ప్రచారం చేశారు. చట్టసభల్లో ప్రశ్నించే గొంతుకలకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు అవకాశం కల్పించాలని కోరారు. బీజేపీ అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, నాయకులు కృష్ణకాంత్‌యాదవ్, రాజిరెడ్డి, రాజు, స్వామి, రవి, సత్యనారాయణ, భాస్కర్, నర్సింలు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కళాజాత ప్రదర్శన



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

సిరిసిల్లటౌన్: మున్సిపాలిటీ ఏరియాలో ఆదివారం తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఎండల తీవ్రత నుంచి తట్టుకునేలా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కళాజాత నిర్వహించారు. కళాకారుల టీమ్ లీడర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి, కళాకారులు శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిళ్ల పర్శరాములు, వంతడుపుల గణేశ్ పాల్గొన్నారు.

గాలిపెల్లిలో ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

ఇల్లంతకుంట: గాలిపెల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో స్థానిక వైద్యుడు తాటికొండ అనిల్ ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించారు. మాజీ సర్పంచ్ మల్లుగారి వాణి, మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి శ్యామల, నాయకులు సింగిరెడ్డి మాధవరెడ్డి, పుల్లుగారి చంద్రారెడ్డి, ఆనందరెడ్డి తదితరులు హాజరయ్యారు.

హరితహారం మొక్కలు దగ్ధం



కాలిపోతున్న మొక్కలు

చందుర్తి: చందుర్తి మండలం లింగంపేట శివారులోని వీరునిగడ్డ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన నాటిన హరితహారం మొక్కలకు ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని దగ్ధమయ్యాయి. సుమారు 50 మొక్కలు కాలిపోయాయని స్థానికులు పేర్కొన్నారు. ఎండిన ముళ్ల కంచెలతోనే నిప్పుకు ఆజ్యం పోసినట్లయిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్లాంటేషన్‌లో మంటలు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని బాబాయ్‌చెరువుతండా గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌లో ఆదివారం మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. దాదాపు 2 నుంచి 3 వేల మొక్కలు కాలిపోయాయని ఇన్‌చార్జి ఎఫ్‌ఎస్‌వో భూలక్ష్మి తెలిపారు. ఎఫ్‌బీవో కిరణ్, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

మద్యంమత్తులో వీరంగం



చెట్టుకు కట్టేసి ఉన్న దేవరాజు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో ఇద్దరు మద్యంమత్తులో వీరంగం సృష్టించారు. గ్రామానికి చెందిన ఏనుగుల దేవరాజు, అతని స్నేహితుడు పెద్దిరాజు కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. ఒకరినొకరు దూషించుకున్నారు. దీంతో పెద్దిరాజు, అతని సోదరుడు వెంకటేశం కలిసి ఏనుగుల దేవరాజును చెట్టుకు కట్టేసి కొట్టారు. కాగా దేవరాజుకు మానసిక స్థితి సరిగ్గా లేదని తెలిసింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడిగా కార్తీక్



కార్తీక్

సిరిసిల్లకల్చరల్: ముదిరాజ్ సంఘం పట్టణశాఖ అధ్యక్షుడిగా వంకాయల కార్తీక్ ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 164 ఓట్లకు గాను కార్తీక్‌కు 109 ఓట్లు పోలయ్యాయి. సమీప ప్రత్యర్థి కీసర నాగరాజుపై 56 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా బొల్లోజు శ్రీనివాస్, ఎంబేరి మహేందర్, ప్రధాన కార్యదర్శి కోల నరేశ్, సహాయ కార్యదర్శి రాగుల నరేశ్, పండుగ రాజు, కోశాధికారి పోలుక ఆనంద్, కార్యవర్గ సభ్యులు పండుగ దేవయ్య, రాగుల శ్రీనివాస్, గొడుగు అరుణ్‌చంద్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కార్తీక్‌ను జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము తదితరులు అభినందించారు.

మజీద్ కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ సమీ



సయ్యద్‌సమీకి నియామకపత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి ముంతాజ్, నాయకులు

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణ మజీద్ కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ సమీ(మౌలానా) ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన ఎన్నికలో 20 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. మజీద్ కమిటీలో మొత్తం 772 ఓట్లు ఉండగా.. 682 పోల్ అయ్యాయి. ఇందులో సమీకి 349 ఓట్లు రాగా.. సమీప ప్రత్యర్థి ముస్తఫాకు 329 ఓట్లు వచ్చాయి. నాలుగు ఓట్లు చెల్లలేదని ఎన్నికల అధికారి ముంతాజ్ తెలిపారు. సమీకి మజీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎండీ సలీం, షేక్ చాంద్, రీనా బాబా అభినందనలు తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ధ్వజస్తంభం తీసుకొస్తున్న భక్తులు

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు హోమం నిర్వహించారు. భక్తులు ధ్వజస్తంభాన్ని తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉంటుందని భక్తులు తెలిపారు.

మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు కేసీఆర్ అని కేటీఆర్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ అన్నారు. ముస్తాబాద్ మండలం మద్దికుంట చెరువు మత్తడి పోస్తున్న సందర్భంగా ఆదివారం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్ల కేసీఆర్ పాలనలో ఒక్క ఎకరా కూడా ఎండకుండా ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని అందించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టించి, మిడ్‌మానేరు ద్వారా మల్లన్నసాగర్‌కు నీటిని పంపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నేడు ఎగువ మానేరు ప్రాజెక్టులోకి నీరు వస్తుందంటే అది కేసీఆర్, కేటీఆర్ చలవేనన్నారు. కార్యక్రమంలో కదిరె భూమయ్య, తిరుపతి, స్వామిగౌడ్, వేణు, స్వామి, కరుణాకర్, సునీల్, దేవయ్య, దేవరాజు, రాకేశ్, సునీల్ తదితరులున్నారు.

మాలమహానాడు అధ్యక్షుడిగా రాజేశం



ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి గ్రామ మాలమహానాడు అధ్యక్షుడిగా దండి రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా న్యాత పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా సొల్లు దామోదరం, కోశాధికారిగా దసనం స్వామి, ఆర్గనైజర్‌గా దండి మల్లేశం, సహ ఆర్గనైజర్‌గా దండి ఎల్లయ్య, ప్రచార కార్యదర్శిగా దండి మహేందర్, ముఖ్య సలహాదారుగా దండి పోచయ్య, దండి స్వామి, దండి శంకరయ్య, సాయిలు, ఆంజనేయులు, సురేష్‌లను ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి హైస్కూల్ 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ గురువులను సన్మానించారు. రోజంతా ఆటపాటలతో సంతోషంగా గడిపారు. గత స్మృతులు నెమరువేసుకున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

వేములవాడరూరల్: వేములవాడ మండలం ఎదురుగట్ల ఏరియాలో ఆదివారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై మారుతి తెలిపిన వివరాలు. మండలంలోని నూకలమర్రి నుంచి వేములవాడకు బైక్‌పై వస్తున్న చెర్ల ఆనంద్‌కుమార్, వేములవాడ నుంచి నూకలమర్రికి వెళ్తున్న జోగం శంకర్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. క్షతగాత్రులు ఇద్దరిని 108లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. వేములవాడకు చెందిన న్యాయవాది చెర్ల ఆనంద్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దగ్ధం



కోనరావుపేట: వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దగ్ధమైంది. కోనరావుపేట మండలం మంగళ్లపల్లికి చెందిన ఉప్పుల జీవన్ తన ట్రాక్టర్‌తో పత్తి చేనులో పత్తిమొక్కలను తొలగించే పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం సమయం కావడంతో ఎండవేడికి ఇంజిన్‌లో నుంచి మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం వేళలో అక్కడ రైతులు ఎవరూ లేకపోవడం, నీరు లేకపోవడంతో ట్రాక్టర్ కాలిపోయింది.

ప్లాట్‌ఫామ్‌పైకి దూసుకెళ్లిన బస్సు

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం బస్సు జగిత్యాల వెళ్లేందుకు 8వ నంబర్ ప్లాట్‌ఫాం వైపు వచ్చి అదుపుతప్పింది. ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లడంతో ప్రయాణికులు గమనించి కేకలు వేస్తూ పరుగులు తీశారు. ఈక్రమంలో మంచిర్యాల జిల్లాకు చెందిన నవనిత్య పరుగులు తీసి కిందపడింది. ఆర్టీసీ అధికారులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి



మంత్రి ప్రభాకర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే డిగ్రీ కళాశాల భవన నిర్మాణంతోపాటు అదనపు తరగతి గదులు, మోడల్ బస్టాండ్, షాపింగ్ కాంప్లెక్స్‌లకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. హైదరాబాద్‌లో ఆదివారం కలిసి ఈమేరకు విన్నవించారు. బుచ్చిలింగ్ సంతోష్‌గౌడ్, దుంపెట జనార్దన్, గుర్రపు రాములు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేలో లోపాలున్నాయి

- మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



మాట్లాడుతున్న కొండ దేవయ్య

సిరిసిల్ల: రాష్ట్రంలో నిర్వహించిన కులగణనలో లోపాలున్నాయని, అందుకే సమగ్ర వివరాలు నమోదు కాలేదని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఆరోపించారు. జిల్లా కేంద్రంలో కులగణనపై ఆదివారం 'రచ్చబండ' నిర్వహించారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో 136 బీసీ కులాలుంటే.. సర్వేను సమగ్రంగా చేయకుండా బీసీల జనాభాను తగ్గించారని విమర్శించారు. ఆధార్ నంబరుతో ఆస్తుల వివరాలను తెలిసే అవకాశం ఉన్నా.. సర్వేలో అనేక ప్రశ్నలు ఉండడంతోనే బీసీ కులాలవారు సర్వేకు దూరమయ్యారని వివరించారు. మున్నూరు కాపులను సర్వేలో చంపేశారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా మళ్లీ సర్వే చేయాలన్నారు. లేకుంటే మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తమ కుల గణనను తామే నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడు వొజ్జల అగ్గిరాములు, నాయకులు కుల్ల సత్తయ్య, దుమాల రవి, చల్ల రవీందర్, మారం కుమార్, కొడిమ్యాల వేణుగోపాల్, ఎరుకల ప్రకాశ్, పల్లికొండ నర్సయ్య, దుమాల రాములు, పడిగల రాజప్ప, కొట్టె శ్రీనివాస్, లింగంపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన సర్వే చేపట్టాలి

వేములవాడ: కులగణన సర్వే పారదర్శకంగా చేపట్టాలని బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాల నాయకులతో పట్టణంలోని మున్నూరుకాపు సంఘం వద్ద గ్రామ రచ్చబండ పేరుతో ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తూపుకారి సత్తయ్య, మారం కుమార్, కొండ కనకయ్య, సీహెచ్.రామస్వామిగౌడ్, కూరగాయల మల్లేశం, కుంభం రవి, చేను ఎలపతి, ఉయ్యాల భూమయ్యగౌడ్, కంశాని శ్రీధర్, చవాన్ అర్జున్, బొగ శ్రీధర్, ఎట్టం సాయికృష్ణ, మిద్దె వినీత్‌గౌడ్, ఎదుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు ఆపక ప్రయాణికుల ఇక్కట్లు



వెంకట్రావుపల్లిలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

- వెంకట్రావుపల్లి చౌరస్తాలో అగచాట్లు

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారి.. మండలంలోని వెంకట్రావుపల్లి చౌరస్తాలో సిరిసిల్ల, వేములవాడ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆదివారం రాత్రి సమయంలో ఆపకపోవడంతో పలువురు ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. చౌరస్తా కావడంతో ఇల్లంతకుంట, మాన్వాడ, మల్లాపూర్ వైపు నుంచి సిరిసిల్ల వైపు వెళ్లేందుకు వెంకట్రావుపల్లి వచ్చిన ప్రయాణికులు అక్కడ బస్సులు నిలకపోవడంతో చాలా సేపు వేచి ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. వెంకట్రావుపల్లి చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు ఆగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. స్పందించిన విప్ వెంటనే దేవదాయశాఖ అధికారులతో మాట్లాడారు. ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్‌చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్‌లో రైతులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి నీరు అందించిన సీఎం, కేకే మహేందర్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. రంగనాయకసాగర్ కాలువ ద్వారా సోమయ్య చెరువులోకి నీరు శాశ్వతంగా వచ్చేలా చర్యలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా వితలాపురం కెనాల్ నుంచి దాచారంలోని ఆముదాలకుంట చెరువుకు దాని ద్వారా చిన్నలింగాపూర్, నర్సింహులపల్లె సోమయ్య చెరువులోకి నీరు వస్తుందన్నారు. మాజీ ఎంపీటీసీ బైరినేని రాము, చిన్నలింగాపూర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

బోనమో పోచమ్మ



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో మాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు తీశారు. ప్రతి ఇంటి నుంచి ఒక బోనం చొప్పున మహిళలు బోనాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పశుసంపదను చల్లంగా చూడాలని వేడుకున్నారు. కులపెద్దలు మంతుర్తి రాజయ్య, బత్తుల బాబు, పంతం అంజి, అంబటి బాబు, మంతుర్తి శ్రీనివాస్, టేకుమల్ల వెంకటి పాల్గొన్నారు.



వీర్నపల్లిలో..

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లి, గర్జనపల్లి అంబేడ్కర్ కాలనీ వాసులు డప్పుచప్పుళ్ల నడుమ పోచమ్మకు చలిబోనాలు సమర్పించారు.

కొనసాగుతున్న బీరప్ప ఉత్సవాలు

చందుర్తి: మండలంలోని ఆశిరెడ్డిపల్లె పరిధి గొల్లపల్లెలో యాదవ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం రెండో రోజు బీరప్ప దేవునికి బోనాలు సమర్పించారు. యాదవ సంఘం అధ్యక్షుడు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.